క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాల విద్యను ప్రోత్సహించాలి



తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రం అందిస్తున్న అధికారులు

తాళ్లూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యను ప్రోత్సహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని మండల విద్యాశాఖ అధికారి సుబ్బయ్య అన్నారు. మండల కేంద్రం తాళ్లూరులో అధికారులు ఎన్రోల్మెంట్ డ్రైవ్ సోమవారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. ఇందులో మండల విద్యాశాఖ అధికారి-1 సుబ్బయ్యతో పాటు హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు పెద్దిరెడ్డి, శ్రీనివాసరావు, రోజమ్మ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం



శస్త్ర చికిత్స కోసం వెళ్తున్న వృద్ధులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో సోమవారం జరిగిన కంటి వైద్యశిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో నంద్యాలకు చెందిన శాంతీరామ్ మెడికల్ కళాశాలకు చెందిన వైద్యులు పాల్గొని 83 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 24 మందికి శస్త్ర చికిత్సలు చేసేందుకు శాంతీరామ్ మెడికల్ కళాశాలకు రిఫర్ చేసినట్లు యూటీఎఫ్ నాయకులు కిరణ్ కిశోర్‌కుమార్ తెలిపారు.

ఇంటర్న్ షిప్ చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ మస్తాన్‌నాయక్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఒకేషనల్ సబ్జెక్ట్ ఐటీలో ఇంటర్న్ షిప్ చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు అనసూయాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంఈఓ మస్తాన్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటర్న్ షిప్ చేసిన 50 మంది విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిజం ఒకేషనల్ ఐటీ ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్, విజయ మాణిక్యం, నాగమూర్తి, కిరణ్‌కుమార్, మీటీ నాయక్, ఆవులయ్య, లక్ష్మీనారాయణ, పోలయ్య, చంద్రమౌళి, శిరీషారాణి, మారుతీరెడ్డి, రమణమ్మ, ప్రసాద్, అనిత, నరేష్, రెబ్కా పాల్గొన్ని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురిచేడు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేసేందుకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. అత్యవసరమైన వారు ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పుల్లలచెరువు: మండలంలోని యండ్రపల్లిలో సోమవారం త్రైత సిద్ధాంత భగీవద్గీతపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రచార సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మహాభారత కాలంలో తాను ఆచరించి ప్రవచించిన భగవద్గీత త్రైత సిద్ధాంతానికి ఆయువు పట్టుగా ఉందన్నారు. చెన్నకేశవులు, బాలరంగయ్య, నవీన్, సరస్వతి, కొండమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకు అండర్ గ్రౌండ్‌లో అగ్నిప్రమాదం



జనరేటర్ నుంచి దట్టంగా వ్యాపించిన పొగలు

మార్కాపురం: పట్టణంలోని కళాశాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు బ్యాంకు అండర్ గ్రౌండ్‌లో జనరేటర్‌ల షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సోమవారం జరిగింది. అగ్ని మాపక అధికారి ఆర్ రామకృష్ణ వివరాల మేరకు.. ప్రైవేటు బ్యాంకు కింద ఉన్న జనరేటర్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి అందులో నుంచి మంటలు చెలరేగాయి. జనరేటర్‌తో పాటు ఏసీ ఔట్‌డోర్‌లు, ఇతర సామగ్రి కాలిపోయాయి. సమాచారం అందుకున్న తమ సిబ్బంది మంటలను అదుపుచేసినట్లు తెలిపారు.

కరుణాలేదు..కనికరమూ లేదు!



మిరపకాయలు ఆరబెట్టుకున్న రైతులు



మిరపకాయలపై కప్పిన పట్టలు

- ఆకాశాన్నంటిన పెట్టుబడులు
- అప్పుల ఊబిలో అన్నదాతలు

కురిచేడు: అన్నదాతకు ఈ ఏడాది అన్నీ గండాలే. అటు వరుణుడి కరుణా లేదు.. ఇటు పాలకుల ఆదరణాలేదు. ఆకాశాన్నంటిన ఎరువుల ధరలు, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలు.. వెరసి చుక్కాని లేని నావలా తయారైంది అన్నదాత పరిస్థితి. ఈ ఏడాది ఆది నుంచి రైతులకు కష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. సకాలంలో వరుణుడి కరుణ లేదు. దీంతో వేసిన పంటలు మళ్లీ మళ్లీ వేయాల్సి వచ్చింది. ఇప్పుడు అకాల వర్షాలకు కాస్త కూస్త పండిన పంట వర్షార్పణమవుతోంది. అయితే కనీసం పాలకులైనా అన్నదాతకు ఆపన్న హస్తం అందిస్తారనుకుంటే అదీ ఎండమావిలా మారింది. పెట్టుబడి సాయం లేదు. ఎరువుల ధరలు తగ్గించనూ లేదు. వెరసి పెట్టుబడి గుదిబండలా మారింది. కనీసం పండించిన పంటకైనా గిట్టుధర లభించక పండిన పంట కూలీలకు, కౌలుకు చాలక అప్పుల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏదిఏమైనా, ఎవరు పట్టించుకున్నా.. ఎవరు పట్టించుకోకున్నా.. ప్రకృతి ప్రకోపించినా.. రైతన్న తాను నమ్ముకున్న భూమిని వదల లేదు. అంతే కాదు తనను నమ్ముకున్న మూగజీవాలతో పాటు కూలీలకు కడుపు నింపేందుకు ఆలోచిస్తాడు తప్ప తన సంగతేంటి అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోడు. ఈ నెల 15వ తేదీ అకస్మాత్తుగా కురిసిన వర్షానికి మిరపకాయలు తడిసి ముద్దయ్యాయి. అసలే కొనే దిక్కులేక.. కోతకోసి అమ్మితే కూలీలకు కూడా సరిపోక ఆవేదన చెందుతున్న రైతన్న గుండెపై వర్షం పిడుగు పడింది. నెంబర్ వన్ లాంటి కాయలు క్వింటాలు రూ.10 వేలకు మించి కొనక ఆందోళన చెందుతున్న రైతున్నలకు తడిసిన మిరపకాయలు కొనేదెవరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

గడియార స్తంభం తొలగింపు అత్యుత్సాహమే



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



గడియార స్తంభం కూల్చివేతకు కొలతలు వేస్తున్న అధికారులు

దర్శి (కురిచేడు): దర్శి అనగానే ప్రజలకు గుర్తుకు వచ్చేది తొలుత గడియార స్తంభం. ఎవరు కొత్త వారు వచ్చినా ముందుగా ఆహ్వానం పలికేది గడియార స్తంభమే. ప్రతి ఒక్కరూ రోజులో ఎన్నో సందర్భాల్లో వారి స్నేహితులు, బంధువులకు గడియార స్తంభం సెంటర్లో ఉన్నానని చెప్పుకోవటం అలవాటైంది. అలాంటిది గడియార స్తంభం కూల్చుతున్నారనే వార్త దర్శి ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. అందరి మదిలో ఒకటే ప్రశ్న ఎవరి మెప్పుకోసం అధికారులు గడియార స్తంభాన్ని కూల్చుతున్నారు? అధికారులు ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవటం, ఉన్నతాధికారులు నిలువరించక పోవటంపై ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చరిత్రను రూపుమాపే చర్యలకన్నా కొత్త చరిత్రలు సృష్టించి దర్శికి మంచి కీర్తి ప్రతిష్టలు తెచ్చేలా పనులు చేస్తే చరిత్రలో పాలకులతో పాటు అధికారులు కూడా నిలిచిపోతారని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలి కేవలం నాయకుల మెప్పు కోసం అధికారులు పనిచేయడంపై అన్ని వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. దర్శి పట్టణంతో పాటు మండలంలో ఎన్నో ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని హితవు పలుకుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతుంటారని, వారు చేసిన పనులే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా అధికారులు చర్యలు తీసుకుంటే ప్రభుత్వం ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటుందని, రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేరు చెప్పటానికి ఇష్టపడని అధికార పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అధికారులు ఇలాంటి పనులు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. రోడ్ల విస్తరణ చేయాలంటే నడి రోడ్డులో ఉన్న గడియార స్తంభం అడ్డమా? అని ప్రశ్నిస్తున్నారు. గడియార స్తంభం చుట్టూ ప్రభుత్వ స్థలం ఉందని, దాన్ని రోడ్డు విస్తరణకు వాడుకోవచ్చు కదా..అని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ వైఖరి మార్చుకుని గడియార స్తంభం కూల్చివేత మానుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రోటరీ క్లబ్ విజ్ఞప్తి..

దర్శి (కురిచేడు): దర్శి పట్టణానికి తలమానికంగా నిలిచిన గడియార స్తంభాన్ని తొలగించవద్దని రోటరీ క్లబ్ సభ్యులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం వారు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అంజేశారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా 25 ఏళ్ల క్రితం రోటరీ క్లబ్ హైదరాబాద్ సహకారంతో నిర్మించామని సభ్యులు తెలిపారు. ట్రాఫిక్ సమస్య ఉంటే గడియారం స్తంభం చుట్టూ ఉన్న షాపులు తొలగిస్తే సరిపోతుందని చెప్పారు. గడియార స్తంభం తొలగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే విధంగా ఆదేశించాలని వారు విజ్ఞప్తి చేశారు. రోటరీ క్లబ్ సభ్యులు కేవీ రెడ్డి, ఏరువ లక్ష్మీనారాయణరెడ్డి, కొల్లా భాస్కర్, పానుగంటి కోటేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గడియార స్థంభాన్ని తొలగించొద్దు
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్

దర్శి (కురిచేడు): దర్శి సెంటర్‌లో ఉన్న గడియార స్థంభాన్ని తొలగించవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. 2001లో పంచాయతీ తీర్మానంతో రోటరీ క్లబ్ తరఫున నిర్మించిన గడియార స్తంభాన్ని తొలగించవద్దని వారు కోరారు. గడియార స్తంభం సెంటర్ ప్రజల్లో బాగా ఫేమస్ అయిందని, దర్శికి ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు.

ట్రాఫిక్ మెరుగు పరిచేందుకు రోడ్డులో ఉన్న గడియార స్తంభాన్ని తొలగించకుండా చర్యలు చేపట్టాలని, దానిచుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 8వ వార్డు కౌన్సిలర్ మేడగం మోహనరెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ టి. బాబూరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా భాస్కరరావు, ముస్లిం మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అమీన్‌బాషా, మజ్నువలి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏపీఓగా వెంకట్రావు బాధ్యతల స్వీకరణ



ఏపీఓ వెంకట్రావు

ముండ్లమూరు (కురిచేడు): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా వెంకట్రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీఓగా పనిచేసిన నాగరాజు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పొదిలి నుంచి బదిలీపై వచ్చిన వెంకట్రావు విధుల్లో చేరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు కల్పిస్తామని, పనులు అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై సమీక్ష నేడు

కురిచేడు: ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సమీక్ష స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉంటుందని ఎంపీడీఓ సతీష్‌బాబు తెలిపారు. సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హాజరవుతారని, మండలంలోని దరఖాస్తుదారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

10.30 గంటల అప్రకటిత విద్యుత్ కోత



సాయంత్రం కూడా పనులు చేస్తున్న కార్మికులు

- మండే ఎండలకు అల్లాడిన ప్రజలు

కురిచేడు: విద్యుత్ స్తంభాల మార్పు పేరుతో విద్యుత్ సరఫరాను 10.30 గంటల పాటు నిరవధికంగా అప్రకటింగా సోమవారం నిలిపి వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక దర్శి రోడ్డులో మెయిన్ లైన్ విద్యుత్ స్తంభాలను మార్చే కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఒక్కసారిగా సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న విద్యుత్ స్తంభాలన్నీ మార్చారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిరవధికంగా నిలిపేశారు. వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా 10.30 గంటల పాటు విద్యుత్ నిలిపేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణను వివరణ కోరగా కేవలం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపేయాలని, మార్చిన విద్యుత్ స్తంభాలకు కనెక్షన్ల కోసమని కోరారని, అందుకు జంపర్లు ఆపుకుని పనిచేయాలని అనుమతి ఇచ్చానని తెలిపారు. కానీ విద్యుత్ కాంట్రాక్టరు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించారని తెలిపారు. ప్రజల అవసరాల కన్నా కాంట్రాక్టరు పనికే విద్యుత్ శాఖ అధికారులు ప్రాధాన్యం ఇవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలు మార్చేందుకు విద్యుత్ సరఫరా ఎన్ని గంటలు ఏ ప్రాంతంలో నిలిపి వేసేది సరైన సమాచారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయల షాపులు తెరిపించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: పట్టణంలో కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు తిరునాళ్ల పేరుతో చేస్తున్న దోపిడీకి అడ్డు కట్ట వేసి అక్రమంగా మూసివేసిన కూరగాయల షాపులను తెరిపించాలని సీపీఎం నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన కూరగాయలను అక్రమంగా వేలం నిర్వహించి మిగిలిన షాపులను మూసివేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దగ్గుబాటి సోమయ్య సబ్‌కలెక్టర్‌ను కోరారు. కూరగాయలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఒకటి, రెండు షాపులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చి అక్కడ అధిక ధరలకు విక్రయించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, జవ్వాజి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కొలుపులు



ఎల్లమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దొనకొండ: మండలంలోని వెంకటాపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో రేణుకా ఎల్లమ్మ కొలుపులు ఆదివారం, సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఏ ప్రాంతంలో ఉన్నా బొరిగొర్ల వంశం వారు ప్రతి 3 లేదా 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చి ఎల్లమ్మ కొలుపులు జరుపుకుంటారు. వారి బంధువులు, కుటుంబ సమేతంగా రేణుకా ఎల్లమ్మకు పూజలు చేసి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. తమ పిల్లా పాపలను కాపాడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఎల్లమ్మ దేవతకు మొక్కుకున్నారు. కొలుపుల కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై రేణుకా ఎల్లమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పలు విషయాలు ఎమ్మెల్యే బూచేపల్లి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, నూనె వెంకటరెడ్డి, కాలూరి రమణయ్య, గుంటు పోలయ్య, బాపనపల్లి శ్రీను, సయ్యద్ ముజాయిద్, వల్లభ రామారావు, వడ్లమూడి బుజ్జి, వడ్లమూడి కొండలు, బండారు రాజు, గుమ్మా వెంకటేశ్వర్లు, ద్వారకచెర్ల చెంచిరెడ్డి, గొంగటి మహేష్‌రెడ్డి, హర్షవర్ధనరెడ్డి, చీరాల ఇశ్రాయేలు, గొంగటి పోలిరెడ్డి, పత్తికొండ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ట



ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

- ఎమ్మెల్యే బూచేపల్లి ప్రత్యేక పూజలు

దర్శి (కురిచేడు): మండలంలోని రామచంద్రాపురంలో సోమవారం బొడ్డురాయి ప్రతిష్ట, జీవధ్వజ స్తంభం ఏర్పాటు కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ జాన్‌సుందరం

పెద్దారవీడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకునేలా చూడాలని, తద్వారా రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉంటారని ఎంపీడీఓ జాన్ సుందరం అన్నారు. పెద్దారవీడు పంచాయతీ సిద్దినాయునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడటంలో కార్యకర్తలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు అంజమ్మ, లక్ష్మీదేవిలు మాట్లాడుతూ చాలా మంది గర్భిణులు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారని, దీంతో బాలింతలు ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వలేరని, కొన్ని సందర్భాల్లో అనారోగ్యంతో చనిపోతున్నట్లు చెప్పారు. పిల్లలకు పోషకాహారంతో పాటు పరిశుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు గర్భిణులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలనే అంశాలపై వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకొని తమ పిల్లల ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. కార్యకర్త నాగమ్మ, ఆయా రమాదేవి, తల్లులు పాల్గొన్నారు.

చప్టాలపై రక్షణ గోడలు లేక ప్రమాదాలు



రేగడపల్లి వద్ద మూల మలుపులో ఉన్న చప్టా

కొనకనమిట్ల: మండలంలోని ఎదురాళ్లపాడు-వాగుమడుగు రహదారి మధ్యలో ఉన్న చప్టాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురాళ్లపాడు సమీపంలో వాగుపై ఉన్న చప్టా, రేగడపల్లి మూల మలుపులో వాగుపై, కొనకనమిట్ల, కాట్రగుంట వెళ్లే రహదారి కాట్రగుంట, పేరారెడ్డిపల్లి సమీపంలో చప్టాలు నిర్మించారు. అయితే నూతన రహదారి ఏర్పాటు చేసే సమయంలో కాని, చప్టాలకు మరమ్మతులు చేపట్టేటప్పుడు కానీ చప్టాలపై రిటెయినింగ్ వాల్స్ నిర్మించకుండా అలాగే వదిలేశారు. దీంతో చప్టాల వద్ద వాహనాలు ఎదురు పడినపుడు డ్రైవర్లతో పాటు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సైడు ఇచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనున్న వాగులో పడే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేగడపల్లి వద్ద ఉన్న చప్టా మూలమలుపులో ఉండటం వలన స్పీడుగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చప్టాల వద్ద సైడు గోడలు నిర్మించాలని, మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.